జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 29 | మార్చి | 2026 ◆ పేజీలు : 8



## ప్రజలకు అందుబాటులో భద్రగిరి మార్ట్

- ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు
- పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 28, ప్రజాజ్యోతి:** భద్రాచలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరి మార్ట్ ను గవర్నర్ శివప్రతాప్ శుక్లా, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను

మిగతా 2 లో...

- భక్తుల జయజయధ్వానాల మధ్య రాజలాంఛనాల సమర్పణ
- రామచంద్రుడికి అష్టోత్తర శత నామార్చన
- పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్ శివప్రతాప్ శుక్ల
- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్



## కల్యాణ రాముడికి...

# మహా పట్టాభిషేకం

5 లో...

## గోదావరి వంతెనపై చిన్నారితో కలిసి దూకిన తల్లి

- మత్స్యకారుల అప్రమత్తతతో రక్షణ




**భద్రాచలం టౌన్, మార్చి 28, ప్రజా జ్యోతి:** భద్రాచలం గోదావరి వంతెనపై శనివారం మధ్యాహ్నం ఓ తల్లి తన చిన్నారితో కలిసి నదిలోకి దూకిన ఘటన కలకలం రేపింది. అయితే సమీపంలో ఉన్న మత్స్యకారుల అప్రమత్తతతో తల్లి, చిన్నారి ప్రాణాలతో బయటపడ్డారు. అనంతరం వారిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భద్రాచలం సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం, పాల్వంచకు చెందిన సరిత

మిగతా 2 లో...

## ఐటీబీపీ సైనికులు మానవత్వం

- గర్భిణీ స్త్రీని 5 కిలోమీటర్లు మోసుకెళ్లిన జవాన్లు



**చర్ల, మార్చ్ 28:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్ పూర్ జిల్లా దట్టమైన అడవుల్లో ఐటీబీపీ జవాన్లు, నారాయణ్ పూర్ పోలీసులు సంయుక్తంగా క్లిష్ట పరిస్థితుల్లో ఒక గర్భిణీ స్త్రీ ప్రాణాలను కాపాడటానికి సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఈ విధంగా ఒక ఆదర్శప్రాయమైన మానవతా చర్య వెలుగులోకి వచ్చింది.ఇంద్రావతి జాతీయ ఉద్యానవనంలోని అబుజ్‌మాడ్ ప్రాంతంలో ఉన్న బోటర్ అనే మారుమూల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. అక్కడ ఒక గర్భిణీ స్త్రీ పరిస్థితి అకస్మాత్తుగా విషమించింది. ఆ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆ మహిళను వెంటనే

మిగతా 2 లో...

## ప్రజలకు అందుబాటులో భద్రగిరి మార్ట్





(మొదటి పేజీ తరువాయి...)

గవర్నర్ దంపతులు పరిశీలించారు. అనంతరం గవర్నర్ శుక్లా మాట్లాడుతూ ప్రజా ఉపయోగకర అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయని ఇందుకు కృషి చేసిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం లక్ష్యంగా ఈ గిరి మార్ట్ ను ఏర్పాటు చేసినట్లు అధికారులు గవర్నర్‌కు వివరించారు. అడవి ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, గిరిజన హస్తకళా వస్తువులను ఒకే వేదికపై విక్రయానికి అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే ట్రైబల్ మ్యూజియం వంటి వినూత్న కార్యక్రమాలతో గుర్తింపు పొందిన పిఓ రాహుల్ భద్రగిరి మార్ట్ అందుబాటులోకి తేవడంతో మరో మైల్ రాయిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఐటీడీఏ పీవో బి రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ మరియు ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## గోదావరి వంతెనపై చిన్నారితో కలిసి దూకిన తల్లి

(మొదటి పేజీ తరువాయి...)



అనే మహిళ తన చిన్నారితో కలిసి శనివారం మధ్యాహ్నం గోదావరి వంతెన వద్దకు వచ్చింది. ఈ సమయంలో ఆమె ఆకస్మాత్తుగా చిన్నారిని ఒడిలో పెట్టుకుని నదిలోకి దూకింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా హాహాకారాలు చేశారు. అయితే బ్రిడ్జి కింద చేపలు పడుతున్న మత్స్యకారులు వెంటనే స్పందించి నీటిలోకి దిగి వారిని రక్షించారు. వారు దూకిన ప్రాంతంలో నీటి ఉధృతి ఉండటంతో అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. మత్స్యకారులు తల్లి, చిన్నారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారిని భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న భద్రాచలం సీఐ నాగరాజు వెంటనే స్పందించి వైద్యశాలకు చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు చూపిన మానవతా దృక్పథం, తక్షణ స్పందన స్థానికుల ప్రశంసలు పొందుతోంది. ప్రాణాలను కాపాడిన మత్స్యకారుల ధైర్యసాహసాలను ప్రజలు కొనియాడుతున్నారు.

## ఘనంగా పెద్దమ్మ తల్లి సరువుల ఊరేగింపు జాతర





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 28,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలం కేంద్రంలో గల రాజపురం గ్రామంలో వేంచేసి ఉన్న పెద్దమ్మ తల్లి జాతర గత ఐదు రోజులుగా ఘనంగా కొనసాగుతోంది. ఆదివాసి నాయకుపోడు ఆరాధ్య దైవంగా భావించే ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా బియ్యం ఓడి కట్టుట, బూడిద పట్నం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడుతోంది. శనివారం పెద్దమ్మ తల్లి సరువుల ఊరేగింపును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గుండాల సరువులను గ్రామమంతా ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిర్లపై ప్రతిష్టించారు. జాతర సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు మొక్కులు తీర్చుకుంటూ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలో భక్తులకు తాగునీరు, ప్రసాదం వంటి ఏర్పాట్లు చేశారు. భక్తి గీతాలతో ప్రాంతం మారుమోగింది. ఈ కార్యక్రమంలో రాములు, రంగ, కన్నయ్య, అర్జయ్య, నాగరాజు, నరసింహారావు, బాలు, రాజా, సీతయ్య, భద్రయ్య, పకీరు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడిలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం

**కొత్తగూడెం, మార్చి 28 (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం 55వ డివిజన్ పరిధిలోని కూలీ లైన్ 9వ సెంటర్ అంగన్వాడిలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 55వ డివిజన్ కార్పొరేటర్ సింగర హరిహరన్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులను కన్నతల్లిలా చూసుకుంటూ డివిజన్‌కు మంచి పేరు తీసుకురావాలని అంగన్వాడి టీచర్ రజిని కుమారిని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, డివిజన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఐటీబీపీ సైనికులు మానవత్వం

(మొదటి పేజీ తరువాయి...)

ఆసుపత్రికి తరలించడం అత్యంత కష్టతరమైంది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, ఐటీబీపీ 29వ బెటాలియన్ నారాయణ్‌పూర్ పోలీసులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు.మానవత్వాన్ని, కర్తవ్య స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, సైనికులు ఆ మహిళను స్ట్రెచర్‌పై దాదాపు 5 కిలోమీటర్ల దూరం, దట్టమైన అడవులు, కొండలు, మట్టి దారుల గుండా మోసుకెళ్లి, సురక్షితంగా రోడ్డుపైకి తీసుకువచ్చారు. ఎంతో శ్రమ తర్వాత, ఆ మహిళను సకాలంలో ఓర్చాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు, అక్కడ వైద్యుల పర్యవేక్షణలో ఆమె సురక్షితంగా ప్రసవించింది. తల్లి, నవజాత శిశువు ఇద్దరూ పూర్తిగా క్షేమంగా ఉండటం ఊరటనిచ్చింది.జవాన్ల మానవత్వాన్ని అందరు అభినందించారు .

## పేదల గుర్తింపుకు ఇంటింటి సర్వే ప్రారంభం



**పినపాక,మార్చి 28(ప్రజాజ్యోతి):** పినపాక మండలం పోట్లపల్లి గ్రామంలో పేదల గుర్తింపునకు సంబంధించిన ఇంటింటి సర్వే కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ మద్దెల సమ్మయ్య, ఉపసర్పంచ్ కోరిపెల్లి రవీందర్, మాజీ సర్పంచ్ తోలేం కళ్యాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ మ్యాప్‌ను గీసి, గ్రామంలోని ప్రతి కుటుంబ స్థితిగతులను ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా వివరించారు. అర్హులైన పేదలను ఖచ్చితంగా గుర్తించి ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అవసరమైతే మరల ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరిస్తామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ తోలేం కళ్యాణి మాట్లాడుతూ, 2003లో కూడా ఇలాంటి సర్వే నిర్వహించగా గ్రామానికి పలు అభివృద్ధి పనులు వచ్చినట్లు గుర్తుచేశారు. అదే విధంగా ఈసారి కూడా సర్వే ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించి గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు తోలేం మల్లేష్, ఉడుగుల రాము, కాంగ్రెస్ నాయకులు తోలేం కృష్ణ, పోలేబోయిన నాగేశ్వరావు, బడే అనిల్, చిట్టి శ్రీను, పోలేబోయిన రాంబాబు, ఏపీఎం విజయ, సీసీ వెంకటలక్ష్మి , సీఆర్‌పీలు పద్మ, అనూష, స్నేహ, అశ్విని, వీఓ అధ్యక్షులు బడే రమాదేవి, వీఓఏ బడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 19 మంది మావోయిస్టుల లొంగుబాటు..?



**చర్ల, మార్చ్ 28:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా గడువులోగా నక్సల్ రహితంగా మారేందుకు సిద్ధంగా ఉంది. జిల్లాలో మిగిలి ఉన్న 19 మంది నక్సలైట్లు లొంగిపోతారని భావిస్తున్నారు. వీరిలో డీవీసీఎం చందర్, ఏసీఎం రూపీలతో పాటు కాంకేర్‌లోని పార్తాపూర్ ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. వీరి లొంగిపోవడంతో కాంకేర్ జిల్లా పూర్తిగా నక్సల్ రహితంగా మారుతుంది.అందిన సమాచారం ప్రకారం, పార్తాపూర్ ఏరియా కమిటీకి చెందిన ఈ 19 మంది నక్సలైట్లు అబుజ్‌మాడ్, కాంకేర్‌లోని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో దాక్కున్నారు. వీరు కోయిలిబేడ మీదుగా కాంకేర్ జిల్లా కేంద్రానికి చేరుకున్నట్లు సమాచారం. లొంగిపోయిన వారిలో మహిళా నక్సలైట్ రూపీ ప్రముఖురాలు. ఆమె రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్‌సీఎం) విజయ్ రెడ్డి భార్య. ఎస్‌సీఎం విజయ్ రెడ్డి రాజ్‌నంద్‌గావ్‌లో, ఆ తర్వాత మోహ్లా-మన్‌పూర్-చౌకీ జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు .అందిన సమాచారం ప్రకారం, ఉత్తర బస్తర్ కాంకేర్‌లో నక్సలైట్లు లొంగిపోకుండా విజయ్ రెడ్డి భార్య రూపీ అడ్డుకుంటున్నారు. కానీ గడువు సమీపిస్తుండటంతో, గత రెండు రోజుల్లో కాంకేర్‌లో ఆరుగురు నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో ఆర్‌కేబీ విభాగానికి చెందిన ఐదుగురు, డీవీసీఎం హోదాలో ఉన్న ఒక మహిళా నక్సలైట్ ఉన్నారు. కాంకేర్‌లో భద్రతా దళాల ఒత్తిడి పెరగడంతో, ఉత్తర బస్తర్‌లోని నక్సలైట్ సంస్థ పూర్తిగా విచ్ఛిన్నమైంది. ఫలితంగా ఇతర నక్సలైట్లు కూడా వేగంగా లొంగిపోతున్నారు.

# భద్రాచలం శ్రీరామనవమి వేడుకలు విజయవంతం

- జిల్లా యంత్రాంగానికి దేవాదాయ శాఖ కమిషనర్ అభినందనలు



**భద్రాచలం, మార్చి 28, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం వేడుకలు విజయవంతంగా నిర్వహించినందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. స్వామివారి వేడుకలను అత్యంత వైభోగంగా నిర్వహించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని ఆయన ప్రశంసించారు.సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చినప్పటికీ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మహోత్సవ వేడుకలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజలకు చేరవేసిన పాత్రికేయుల సేవలను కూడా ఆయన అభినందించారు.వేడుకలను తిలకించేందు కు దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక టికెట్ల విక్రయానికి చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు వీక్షించేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భద్రాచలం రాలేని భక్తులు టెలివిజన్, సోషల్ మీడియా వేదికల ద్వారా వేడుకలను వీక్షించి స్వామివారి కృపకు పాత్రులయ్యారని పేర్కొన్నారు.ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతుందని, ఈ క్రమంలో సీతారాముల కల్యాణం రోజున తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మహా పట్టాభిషేకం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించినట్లు తెలిపారు.వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని చెప్పారు.శ్రీరామనవమి రోజున కళ్యాణం అనంతరం భద్రాచలంలో 80 తలంబ్రాల కౌంటర్లు ఏర్పాటు చేసి, అలాగే ఆర్టీసీ బస్సుల ద్వారా భక్తులకు ఉచితంగా తలంబ్రాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అదనంగా, తలంబ్రాలను కొరియర్, పోస్టల్, కార్గో సేవల ద్వారా పొందేందుకు దేవస్థానం భక్తులకు అవకాశం కల్పించిందని తెలిపారు.భద్రాద్రికి విచ్చేసిన భక్తులకు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున సేవలు అందిస్తూ మంచినీళ్లు, మజ్జిగ, అన్నదానం నిర్వహించినందుకు వారి సేవలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.

## ఎర్త్ అవర్ ద్వారా విద్యుత్ పొదుపుపై అవగాహన

- విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం




**అన్నపురెడ్డిపల్లి, మార్చి 28,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని పాఠశాల నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు తరగతి గదుల్లోని ఫ్యాన్లు, లైట్లు, కార్యాలయంలోని కంప్యూటర్లను నిలిపివేసి విద్యుత్ పొదుపు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఉపాధ్యాయులు సునందరెడ్డి, పద్మ, మోతిలాల్ విద్యార్థులకు భూమి గంట ఉద్దేశ్యం, పర్యావరణ పరిరక్షణ అవసరంపై వివరించారు. మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు ప్రతి ఒక్కరూ విద్యుత్ వినియోగాన్ని నిలిపివేసి భూమి రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.భూమి గంట ఉద్యమం 2007లో ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రారంభమై, ప్రతి సంవత్సరం మార్చి నెల చివరి శనివారం నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం కల్పిస్తోంది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతకుమారి, రాజ్యలక్ష్మి , బాబురావు, బాలు, వసంత, సుశీల, జయరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- శిక్షణను అందిపుచ్చుకుని స్వయం ఉపాధి వైపు అడుగులేయాలి
- ఐటీడీఏ పీవో బి. రాహుల్ పిలుపు
- ముగిసిన ఐదు రోజుల శిక్షణ



**భద్రాచలం టౌన్, మార్చి 28 ప్రజాజ్యోతి ,** తేనెటీగల పెంపకంపై శిక్షణ తీసుకున్న యువతీ యువకులు మార్కెట్ సౌకర్యం కల్పించుకొని జీవనోపాధి కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ యువతి యువకులకు సూచించారు. శనివారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో హనీ బీ (తేనెటీగల) పెంపకం ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో గిరిజనులు సేకరించే తేనెకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, దానికి అనుగుణంగా శిక్షణ తీసుకున్న యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని తేనెను సేకరించి మార్కెట్ సౌకర్యం కల్పించుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని అన్నారు. ఐదు రోజుల తీసుకున్న శిక్షణలో శిక్షకులు అందించిన మెలకువలు ముఖ్యంగా తేనెటీగల ప్రాముఖ్యత, తేనె ఉత్పత్తి, వ్యాపారం చేసుకునే విధానం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకోవడం, వాట్సాప్ మరియు ఆన్లైన్ ద్వారా అమ్ముకునే విధానం, తేనెను సేకరించడానికి కాలనీలా నిర్వహణ, సీజన్కు అనుగుణంగా తీసుకునే జాగ్రత్తలు, తేనె సేకరణ విధానము, బి బాక్సులను ఎలా నిర్వహించాలో అలాగే తేనె తీగల కాలనీలను ఏ విధంగా పరిశీలించాలో క్షుణ్ణంగా తెలుసుకున్నందున వెంటనే ఆచరణలో పెట్టి తేనె తీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందాలని అన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న యువతీ యువకులకు శిక్షణ పూర్తయిన సర్టిఫికెట్లు మరియు హనీ బీ బాక్సులను అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ మరియు యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28 ,ప్రజా జ్యోతి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శనివారం పాల్వంచ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం, అదేవిధంగా గ్రంథాలయ పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాలయ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్‌తో పాటు మరో అతిథి 1వ వార్డు కౌన్సిలర్ సీరం సుగుణ, స్టార్ చిల్డ్రన్ హై స్కూల్ కరస్పాండెంట్ జి. భాస్కరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయ సేవలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ సీరం సుగుణ, లైబ్రేరియన్ కే. మధుబాబును , చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, స్టార్ చిల్డ్రన్ హై స్కూల్ విద్యార్థులు డాక్టర్ జ్యోత్స్న , గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒడ్డుగూడెం సూపర్ మార్కెట్ ముందు పగిలిన డ్రైనేజ్ పైపు

- ప్రమాదాలకు దారితీస్తున్న గుంట



**పాల్వంచ, మార్చి 28, ప్రజా జ్యోతి:** పాల్వంచలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో రాజన్న సూపర్ మార్కెట్ ముందు ప్రధాన రహదారిపై డ్రైనేజ్ పైపు పగిలి నెలలు గడుస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. పగిలిన పైపు కారణంగా రోడ్డుమధ్యలో గుంట ఏర్పడి, ప్రయాణికులకు ప్రమాదకరంగా మారిం ది.ఈ గుంటలో బైకులు, ఆటోలు తరచూ పడుతూ ప్రయాణికులు గాయాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొంటున్నా రు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుంటారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా బాలాజీ కళ్యాణం





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 28, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉదయం వేళల నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుప్రభాత సేవ, అర్చనలు, తోమాల సేవ, సహస్రనామార్చన వంటి కైంకర్యాలు నిర్వహించారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు.కళ్యాణ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. అర్చనలు, ప్రత్యేక సేవల మధ్య కళ్యాణ కార్యక్రమం ఘనంగా సాగింది.కళ్యాణ అనంతరం భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ పివి రమణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## రేపు బహిరంగ సంత వేలం పాటలు

**బూర్గంపహాడ్, మార్చి 28 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో మోరంపల్లిబంజర్, సారపాక పంచాయతీల్లో 2026-2027 ఆర్థిక సంవత్సరాలకుగాను వారాంతపు సంత వేలం పాటలకు సంబంధించి సోమవారం బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని ఆయా పంచాయతీల సర్పంచ్ లు బొర్రా సుభద్ర, గుగులోత్ కిషోర్నాయక్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మోరంపల్లి బంజర్ పంచాయతీలో సోమవారం ఉదయం 11 గంటలకు, సారపాక పంచాయతీ కార్యాలయంలో 10 గంటలకు సంత వేలం పాటలు ఉన్నతాధికారుల సమక్షంలో జరుగుతాయని, నిబంధనలకు అనుగుణంగా జరిగే వేలం పాటలకు పాటదారులు సకాలంలో హాజరవ్వాలని పూర్తి వివరాలకు పంచాయతీల్లో సంప్రదించాలని వారు కోరారు.

## బీసీ వెల్ఫేర్ నూతన ప్రిన్సిపల్‌ను కలిసిన టీఎస్‌యూటీఎఫ్ బృందం

- గురుకుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా: ప్రిన్సిపల్ జి. విజయనిర్మల



**భద్రాచలం టౌన్, మార్చి 28 ప్రజాజ్యోతి**భద్రాచలం పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. విజయనిర్మలను శనివారం టీఎస్‌యూటీఎఫ్ భద్రాచలం మండల కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమ సంఘం ఎల్లప్పుడూ పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యల పరిష్కారంలోనూ, పాఠశాల పురోగతిలోనూ సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం ప్రిన్సిపల్ విజయనిర్మల మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అభినందనలు తెలిపిన మండల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అంకిత భావంతో పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్, మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, సీనియర్ నాయకులు ఎస్.ఎన్.వి.ఆర్. శ్రీనివాస్, మండల ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్. కన్వీనర్ కె. సైదులు, సాంస్కృతిక కమిటీ మండల కన్వీనర్ పి. భారతి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


## అంధకారంలో బి సి ఎం రోడ్డు ప్రధాన రహదారి

- మూన్నాళ్ళ ముచ్చటగా సెంట్రల్ లైటింగ్
- రాత్రివేళలో ఆందోళనలో ప్రయాణికులు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28,ప్రజా జ్యోతి:**కొత్తగూడెం – బిసియం ప్రధాన రహదారి అంధకారంలో మగ్గుతోంది. రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా ప్రయాణికులు కారు చీకట్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఈ రహదారి గుండా భద్రాచలం పుణ్యక్షేత్రానికి వస్తూ పోతుంటారు, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద మొత్తంలో భద్రాచలం శ్రీ రామచంద్రుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. శ్రీరామ నవమి వేడుకలో సెంట్రల్ లైటింగ్ ఫెయిల్యూర్ కావడం పై భక్తులు, ప్రయాణకులు అంధకారంలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

**అధికార యంత్రాంగం దృష్టి సారించాలి ...**రాత్రివేళ వెలుగులు నింపాల్సిన సెంట్రల్ లైటింగ్ తరచూ మరమ్మతులకు నోచుకోవడం పై ప్రజల నుండి అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొత్తగూడెం – పాల్వంచ జంట నగరాలుగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర యంత్రాంగం కొత్తగూడెం నగరపాలక సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రెండున్నర దశాబ్దాలుగా ఎన్నికలు లేని పాల్వంచ మున్సిపాలిటీని ప్రక్కన పెట్టి, కార్పొరేషన్ లో విలీనం చేసి ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే, వెలుగుల జిమ్మే కర్మాగారం పాల్వంచలో ఉన్నప్పటికీ చీకట్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఈ క్రింది విధంగా అభ్యర్థిస్తున్నారు,మరమ్మతులకు గురైన సెంట్రల్ లైటింగ్ సిస్టం ను యుద్ధ ప్రాతిపదికన సరి చేసి, వెలుగులు నింపేలా చూడాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్‌లను ప్రజలు కోరుతున్నారు.





# కూలీ నుంచి గోల్డ్ మెడలిస్ట్ వరకు

- గిరిజన యువకుడిని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దిన జిమ్ కోచ్ జి.వి. రామిరెడ్డి
- కోచ్ రామిరెడ్డి స్ఫూర్తి దాయక ప్రయాణం
- రామిరెడ్డికి ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలి... ప్రజల డిమాండ్







**భద్రాచలం టౌన్, మార్చి 28, ప్రజా జ్యోతి:**
ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువ క్రీడాకారుడు మోడెం వంశిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన జిమ్ కోచ్ జి.వి. రామిరెడ్డి సేవలు ప్రశంసనీయం అని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు.జామాయిల్ నర్సరీలో దినసరి కూలీగా పనిచేస్తున్న సమయంలో వంశిలోని ప్రతిభను గుర్తించిన రామిరెడ్డి, అతన్ని భద్రాచలానికి తీసుకు వచ్చి పవర్ లిఫ్టింగ్ లో శిక్షణ ఇచ్చారు. క్రమంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బంగారు పతకాలు సాధించేలా తీర్చిదిద్దారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, స్థానిక ప్రముఖులు, ఐటీడీఏ పీవో రాహుల్, ఐఎంఏ, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో వంశిని అంతర్జాతీయ పోటీలకు పంపించారు. దీం తో వంశి మాల్టా, దక్షిణాఫ్రికా, ఉత్తరాఖండ్, ఉత్తర అమెరికా వంటి ప్రదేశాల్లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి దేశానికి గౌరవం తీసుకువచ్చాడు.భద్రాచలం అంబేద్కర్ సెంటర్ లో 2011లో స్థాపించిన “సిటీ స్టైల్ జిమ్” ద్వారా జి.వి. రామిరెడ్డి అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ అందించారు. ముఖ్యంగా దాసరి క్రాంతి కుమార్, ఎస్కె అబ్దుల్ ఫరూక్, మహంతి వెంకటకృష్ణాజీ, మామిడి భూమిక వంటి క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటగా, మోడెం వంశి అంతర్జాతీయ స్థాయిలో రాణించాడు. ఇంకా అనేక మంది యువ క్రీడాకారులను తయారు చేసిన చరిత్ర “సిటీ స్టైల్ జిమ్”కు ఉందని స్థానికులు తెలిపారు.

**కోచ్ జీవన ప్రయాణం ఆదర్శం....**

గొంగడి వెంకటరామిరెడ్డి (జి.వి. రామిరెడ్డి) వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. స్వస్థలం పురుషోత్తపట్నం గ్రామం (ఉమ్మడి ఖమ్మం జిల్లా). తండ్రి కృష్ణారెడ్డి, తల్లి తులసమ్మ. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్య మధ్యలోనే ఆపి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.తర్వాత భద్రాచలంలోని రామ్స్ జిమ్ లో 2004 నుంచి 2010 వరకు శిక్షణ పొందారు. కృషి, పట్టుదలతో 2011లో సొంతంగా “సిటీ స్టైల్ జిమ్”ను ప్రారంభించి, మొదట సారపాకలో నిర్వహించి, అనంతరం 2013లో భద్రాచలం అంబేద్కర్ సెంటర్ కు మార్పిడి చేశారు.2004 నుంచి 2026 వరకు పవర్ లిఫ్టింగ్ రంగంలో అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దుతూ విశేష సేవలు అందిస్తున్నారు.

**ద్రోణాచార్య అవార్డు ఇవ్వాలి....**

రిమోట్ ఏరియా నుంచి వచ్చిన గిరిజన యువకుడిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన జి.వి. రామిరెడ్డి సేవలను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ద్రోణాచార్య అవార్డుకు సిఫార్సు చేయాలని స్థానిక ప్రజలు, క్రీడాభిమానులు కోరుతున్నారు.అనుకూల పరిస్థితులు లేకపోయినా ప్రతిభను వెలికి తీసి, క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్న రామిరెడ్డి వంటి కోచ్ లు సమాజానికి ఆదర్శమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## పాల్వంచ త్రివేణి పాఠశాలలో ఎర్త్ అవర్‌పై అవగాహన కార్యక్రమం



**పాల్వంచ, మార్చి 28, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో ఉన్న త్రివేణి పాఠశాలలో విద్యార్థులకు ఎర్త్ అవర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిత్య జీవితంలో వినియోగించే విద్యుత్తును కొంతసేపు నిలిపివేయడం ద్వారా శక్తి సంరక్షణ ఎలా సాధ్యమవుతుందో విద్యార్థులకు వివరించా రు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ ఈ. రామ్మూర్తి, కిడ్స్ ఇంచార్జ్ జి. క విత ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 44వ వార్డు కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు విద్యార్థులకు ఎర్త్ అవర్ ప్రాముఖ్యతపై మార్గదర్శనం చేశారు.పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ విద్యుత్ వినియోగం, అధిక ఉష్ణోగ్రత నియంత్రణపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్మశానవాటిక, కబరస్తాన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**బూర్గంపహాడ్, మార్చి 28 (ప్రజా జ్యోతి) :**బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామపంచాయతీలో ముస్లీంల స్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు, కబరస్తాన్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.30లక్షలతో చేపట్టే నిర్మాణ పనులకు సర్పంచ్ బానోత్ సరోజ శనివారం శంకుస్థాపన చేశారు. ముస్లీంల ఇబ్బందులను గమనించి సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఐటీసీ మేనేజర్ విశ్వనాథం, బీఆర్ఎస్ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, దారం కృష్ణారెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడగం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు బుస్కాని నరేష్, ఇమడబత్తిన రామకృష్ణ, ఎడమకంటి పిచ్చిరెడ్డి, యారం వెంకట్రామిరెడ్డి, మొండెద్దుల వెంకటేశ్వరెడ్డి, బానోత్ రామదాసు, మాజీ సర్పంచ్ బానోతు కృష్ణ, నాగిరెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, నరేష్రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- భక్తుల జయజయధ్వానాల మధ్య రాజలాంఛనాల సమర్పణ
- రామచంద్రుడికి అష్టోత్తర శత నామార్చన
- పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్ శివప్రతాప్ శుక్ల
- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్



# కల్యాణ రాముడికి... మహా పట్టాభిషేకం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 28, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వసంతపక్ష బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ రాముడికి శనివారం శ్రీరామ మహా పట్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం సాగిన ఈ మహోత్సవంలో భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ సార్వభౌముడికి రాజలాంఛనాలు సమర్పించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించగా, పుష్యమి నక్షత్ర పర్వదినాన కల్యాణ రాముడికి పట్టాభిషేక ఘట్టాన్ని మిథిలా స్టేడియంలో భక్తజన కోలాహలం నడుమ నిర్వహించారు. నూతన దంపతులైన సీతారామచంద్రస్వామివారిని శనివారం ఉదయం 9.40 గంటలకు ఆలయం నుంచి మేళతాళాలు, భజన్త్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాటాల మధ్య మిథిలా స్టేడియంకు తీసుకువచ్చారు. ఉదయం 10.30 గంటలకు అక్కడికి చేరుకుని, 10.48 గంటలకు శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపంలో ఆసీనులయ్యారు. అనంతరం అర్చకస్వాములు, వేదపండితులు పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, కలశారాధన అనంతరం రాజలాంఛనాలతో పట్టాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ఎనిమిది మంది వైదిక మంత్రులు పాల్గొనగా, వశిష్ఠ స్థానంలో భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ముఖ్య అర్చకులు అమరవాది వెంకట సీతారామానుజాచార్యులు ఉన్నారు. తదుపరి తారక మంత్రం, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. శ్రీరామ మహాసామ్రాజ్య ఘట్టంలో భాగంగా ఒక్కొక్కటి స్వామివారికి అలంకరించారు. ముందుగా బంగారు పాదుకలను సమర్పించి, అనంతరం రాజదండం, రాజముద్రిక, భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడను లక్ష్మణస్వామికి సమర్పించారు. తదుపరి చామరం, బంగారు చత్రం, రాజఖడ్గం సమర్పించి చివరగా సామ్రాట్ కిరీటాన్ని ధరింపజేశారు. దేవేంద్రుడు పంపిన కానుకగా చెప్పబడే ముత్యాలహారాన్ని తొలుత శ్రీరాముడికి ధరింపజేసి, అనంతరం అది సీతమ్మకు, తరువాత భక్తుల ప్రతినిధిగా హనుమంతుడికి సమర్పించారు. అనంతరం సమస్త నదీజలాలు, నాలుగు సముద్రాల నుంచి సేకరించిన తీర్థాలతో స్వామివారికి ప్రోక్షణ నిర్వహించారు. ఆ తీర్థజలాలను గవర్నర్ శివప్రతాప్ శుక్ల, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భక్తులపై ప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆహోబిల మఠం, చినజీయర్ స్వామి, కంచి పీఠం, భక్తరామదాసు వారసుల తరపున కూడా ప్రతినిధులు పట్టు వస్త్రాలను సమర్పించారు. భద్రాచలం చేరుకున్న గవర్నర్‌కు బీపీఎల్ పాఠశాల హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీఓ బి. రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ప్రథమ శ్రేణి న్యాయాధికారి శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.









## మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28,ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల బియ్యం కోటాను ఇవ్వాలని మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే మూడు నెలల కోటాను రేషన్ దుకాణాలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న కారణంగా బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రేషన్ బియ్యం పంపిణీ వచ్చే నెల 1 నుంచి ప్రారంభించి 15వ తేదీ లోగా పూర్తి చేయాలని అధికారులు డీలర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**డీలర్లకు తలనొప్పి...** దుకాణాల్లో ఒక్క నెల కోటాను నిల్వ చేసుకునేందుకే స్థలం లేకపోవడంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలల బియ్యాన్ని ఎలా నిల్వ చేయాలో తెలియక సతమతవుతున్నారు. బియ్యం పంపిణీకి ఏప్రిల్ మొత్తం గడువు ఇచ్చి విడతల వారీగా దుకాణాలకు సరఫరా చేయాలని కొంత మంది డీలర్లు కోరుతున్నారు. మరోవైపు ఒక్కో కార్డుదారుడు మూడు సార్లు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. దీనికి తోడు సర్వర్ సమస్యలు ఉండనే ఉంటాయి. కార్డుదారునికి దాదాపు 15 నుంచి 20 నిమిషాలు సమయం పట్టే అవకాశం ఉండటంతో గడువులోగా బియ్యం పంపిణీ పూర్తి చేయడం డీలర్లకు సవాల్‌గా మారనుంది.

## 24 ఏరియా సీత రామాలయంలో అన్నదానం



**ఇల్లందు, మార్చి 28, ప్రజాజ్యోతి:**పట్టణంలోని 24 ఏరియాలో గల సీత రామాలయంలో శనివారం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రాముని ఆశీస్సులతో ప్రతి ఇంట ఆయురారోగ్యాలు, పిల్లాపాపలు, పాడి పంటలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, స్థానికులు మాదాసు సుమన్, లలిత్ కుమార్ పాసి , సతీష్ పాసి, ఉరుసు రామకృష్ణ, శరత్, కుమార్, నవీన్, శివ, మనోహర్ పాల్గొన్నారు.

## ప్లాంటేషన్లను తనిఖీ చేసిన సీసీఎఫ్ క్షితిజ



**లక్ష్మీదేవిపల్లి మార్చి 28 ప్రజా జ్యోతి:** కొత్తగూడెం రేంజ్ లో ఉన్న ప్లాంటేషన్లను కంప సీసీఎఫ్ క్షితిజ తనిఖీ చేసారు. చాతకొండ ప్లాంటేషన్ హేమచంద్రపురం ప్లాంటేషన్ లోతు వాగు ప్లాంటేషన్, వనవిహార్ కాంప్లెక్స్ లో గల మీటింగ్ హాలును తనిఖీ చేసినారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ శ్రీ కృష్ణ గౌడ్, ఎఫ్డిఓ కోటేశ్వరరావు, రేంజ్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ లు పాల్గొన్నారు.

# కిన్నెరసాని క్రీడా పాఠశాలలో ప్రవేశాల కొరకు ఎంపికలు

- **మార్చి చివరికి ఐదో తరగతిలో ప్రవేశాలు**
- **ఉమ్మడి జిల్లా నుండి పాల్గొన్న 105 మంది బాలురు**





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 28,ప్రజా జ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, డిప్యూటీ డైరెక్టర్ అశోక్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ప్రభుత్వ గిరిజన మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని లో శనివారం స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు 4వ తరగతి విద్యార్థులకు 9 రకాల బ్యాటరీ టెస్టులు శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన తుది ఎంపికలకు సహాయ గిరిజన సంక్షేమ అధికారి ఎస్ చంద్రమోహన్ సెలక్షన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నాలుగో తరగతి చదువుతున్న 105మంది గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెలలో నిర్వహించిన ఫైనల్ టెస్ట్ ఎంపికలో సెలక్షన్ అయిన విద్యార్థులను 1:2 ప్రకారం 105 మంది పాల్గొన్నారు.మార్చి చివరికల్లా ఐదో తరగతిలో ప్రవేశాలు తీసుకుంటామని ట్రైబల్ వెల్ఫేర్ ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాలరావు తెలిపారు. ఈ బ్యాటరీ టెస్ట్ ఎంపికలలో సహాయ క్రీడల అధికారులు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, శంకర్(ఖమ్మం ) పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం చందు, పిడి బాలసుబ్రమణ్యం, శ్రీనగేష్, రామారావు, రమేష్, రాంబాబు, గోపాల్, మోతిలాల్,హత్తి రామ్, పిఈటిలు రాంబాబు అంజయ్య ముత్తయ్య సంపత్ కృష్ణవేణి, కోచెస్, వాసు, ప్రసాద్, జంజిత్ మండల్ , పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బాలు, సిబ్బంది శంకర్, ఇంగ్లీష్ బాలు నాయక్, భగవాన్ దాస్, కోటేశ్వరరావు, సుక్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు ఐఎన్టీయూసీ భారీ నిరసన దీక్ష**
- **యాజమాన్యానికి మెమోరాండం – సానుకూలంగా స్పందించిన జీఎం పర్సనల్**



**సింగరేణి /కొత్తగూడెం మార్చి 28 ( ప్రజాజ్యోతి )** సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో నెలకొన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఐఎన్టీయూసీ నాయకులు హెడ్ ఆఫీస్ ముందు భారీ ఎత్తున ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజు, జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, కోనేరు సత్యనారాయణ (చిన్ని), బాలశౌరి హాజరై నిరసనకు సంఘీభావం తెలిపారు. నిరసనలో భాగంగా నాయకులు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లకు సర్ఫేస్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఖాళీలను అంతర్గతంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీవీకే అండర్‌గ్రౌండ్ మైన్, సత్తుపల్లి జేవీఆర్ ఓసీపీ, కిష్టారం ఓపెన్‌కాస్ట్, జేవియర్ సీహెచ్‌పీ యూనిట్లలో డిప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగులను తిరిగి కొత్తగూడెం ఏరియాకు మార్చాలని కోరారు. వి.కె కోల్ మైన్స్‌లో బొగ్గు ఉత్పత్తి పనులను కాంట్రాక్ట్ కార్మికులతో కాకుండా పర్మినెంట్ ఉద్యోగులతోనే నిర్వహించాలని మైన్స్, ఓసీపీలు, విభాగాల్లో అవసరమైన టెక్నీషియన్లు, ఫిటర్లు, ఎలక్ట్రిషన్లు, క్లర్కులు, సూపర్వైజర్ సిబ్బందిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏరియాలో అక్కడి వారికే అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలని డి.ఎల్.ఆర్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి కనీసం రూ.26 వేల పైగా జీతం ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లపై జీఎం పర్సనల్ (ఐ ఆర్ &పీఎం ) కవిత కి నాయకులు మెమోరాండం సమర్పించగా సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబర రావు, చీకటి కార్తీక్, మండే విరహనుమంతు, చింతలపూడి రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు రావి రాంబాబు, స్వప్న శంకర్, ఆకునూరి సుప్రియ, హరిహరన్, కే.కే శ్రీనివాస్, ఆన్తోటి పాల్, శాంతాదేవి పాల్గొన్నారు. ఒక్కరోజు నిరసన దీక్షలో అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బుటిక రాజేశ్వరరావు, సెంట్రల్ మరియు బ్రాంచ్ కార్యదర్శులు సకినాల సమ్మయ్య, పోశం శ్రీనివాస్, విప్లవ కుమార్, మెంగాని అశోక్, ఏం కొమరయ్య, ట్రెజరర్ భీముడు, రాజేశ్వర జీదుల, ఫిట్ కార్యదర్శులు చిలక రాజయ్య, ఎండి సత్తార్ పాషా, ఈ మోహన్ రెడ్డి, డి శంకర్ బాబు, కే. నటరాజ్, సిహెచ్ సాగర్, మల్లికార్జున్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీలు భాను కమల్, కే కుమార్, భరత్, వై శంకర్ పాల్గొన్నారు. అదేవిధంగా నాయకులు జల్లి కిరణ్, లగ్గాల అజయ్, చిరంజీవి, ఎండి సవిర్, బషీర్, కే నాగేశ్వరరావు, కట్ట నరసింహ, ఎర్రబెల్లి ఈశ్వర్, రమేష్, బండి సాయి, గోల్కొండ నవీన్, భూక్య రవి నాయక్, బాబాద్దీన్, కొప్పుల కుమార్, ఉమర్, అశోక్ కుమారస్వామి, సేఫ్టీ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు సంజయ్, మోహన్, రేవంత్, విజయ్, ఓదెల శంకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేశారు.

**కార్మికుల హక్కుల కోసం పోరాటం ఆగదు: కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న**



సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి వంటి కీలక సంస్థల్లో కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం అనేది సహించబోదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సింగరేణి జోలికొస్తే ఊరుకోము...

- ప్రయివేటు పరం కాకుండా అడ్డు కుంటాం...
- రుద్రంపూర్ లో 'సేవ్ సింగరేణి' భారీ బైక్ ర్యాలీ
- కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం






**కొత్తగూడెం సింగరేణి, మార్చి 28 – ప్రజాజ్యోతి:** సింగరేణి జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, సింగరేణిని ప్రయివేటు పరం కాకుండా అడ్డుకుంటామని, ఇందుకు అందరు కలిసి పోరాడుదామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న 'సేవ్ సింగరేణి జాతా'లో భాగంగా రుద్రంపూర్ ప్రాంతంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్మికులు పాల్గొన్న ఈ ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లు ప్రసంగిస్తూ యాజమాన్య తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ మనుగడ సాగించాలంటే నూతన బొగ్గు బ్లాకులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పడుతున్న ఆదాయపు పన్ను భారాన్ని కోల్ ఇండియా తరహాలో కంపెనీయే భరించాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డును కొనసాగించాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కార్పొరేట్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ ఒప్పందాలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. శాసనసభలో సింగరేణి కార్మికుల గొంతుకగా నిలిచిన ఎమ్మెల్యే కునంనేని సాంబశివ రావు గారి తీరును కొనియాడారు. సింగరేణి మనుగడ కోసం, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు కోసం మరియు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కునంనేని సాంబశివరావు గారు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కార్మికుల పక్షాన ఆయన చేస్తున్న పోరాటాన్ని ఆయన వివరించారు. మార్చి 30న ముగియనున్న ఈ జాతాలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఏకమై తమ హక్కులను కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు అనంతరం ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంత ఇంటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ అన్-ఫిట్ అయిన కార్మికుల డిపెండెంట్లకు మరియు వివిధ కారణాలతో ఆగిపోయిన కార్మికుల పిల్లలకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, ఎస్-1 సర్క్యులర్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్ ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, లేదంటే సింగరేణి వ్యాప్తంగా కార్మిక గర్జన తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జాతాను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ లు వీరభద్రం, వై వి రావు, ముస్కే సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, గట్టయ్య, సందెబోయిన శ్రీనివాస్, నాగేశ్వర రావు, రాము, గుమ్మడి వీరయ్య, హీరాలాల్, ఎంఆర్కె ప్రసాద్, కమల్, మధుకృష్ణ, రాజేశ్వరరావు, సాంబమూర్తి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## జాప్యం చేస్తే సహించేది లేదు...

- టెర్మినల్ బెనెఫిట్స్ చెల్లింపులను సకాలంలో పూర్తి చేయాలని
- జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్





**కొత్తగూడెం సింగరేణి, మార్చి 28 – ప్రజాజ్యోతి:** ఉద్యోగుల సంక్షేమం కిసం బందించిన అంశాల లో ఎటువంటి జాప్యం చేయకుండా నిబంధనలను సరించి త్వరితగతిన పూర్తి చేయాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భముగా ఆయన ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కారుణ్య నియమకాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియల గురించి సమీక్షించి, ఉద్యోగులకు సంబంధించిన టెర్మినల్ బెనెఫిట్స్ చెల్లింపులను సకాలం లో పూర్తి చేయాలని, ఈ కార్యక్రమములో డిజిఎం (పర్సనల్) లు కేసా నారాయణ రావు, ముకుంద సత్యనారాయణ, సీనియర్ పిఓ ఎం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్జాన్, వెల్ఫేర్ పిఓ కే.వరప్రసాద రావు, అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 7,866 కేసులు పరిష్కారం

- మోటార్ ప్రమాద కేసుల్లో రూ.1.34 కోట్ల పరిహారం





**కొత్తగూడెం, మార్చి 28 (ప్రజాజ్యోతి )**జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,866 కేసులు పరిష్కారం అయ్యాయి.వివిధ రకాల కేసులను పరస్పర అవగాహనతో ముగించారు.కొత్తగూడెంలో అత్యధికంగా 5,054కేసులు పరిష్కారం అయ్యాయి.ఇందులో 21 సివిల్, 4,814క్రిమినల్, 219 బ్యాంకు, టెలిఫోన్, సైబర్ సంబంధిత పిఎల్‌సి కేసులు ఉన్నాయి. మోటార్ వాహన ప్రమాదాలకు సంబంధించిన 13 కేసుల్లో రూ.1,34,85,000 పరిహారం చెల్లించేలా ఒప్పందాలు కుదిరాయి. ఇల్లందులో 797కేసులు పరిష్కారం అయ్యాయి. ఇందులో 11 సివిల్, 634 క్రిమినల్, 152 బ్యాంకు, టెలిఫోన్, ప్రామిసరీ నోట్ కేసులు ఉన్నాయి. భద్రాచలంలో 1,729 కేసులు క్లియర్ అయ్యాయి. ఇందులో 1,626 క్రిమినల్, 103 బ్యాంకు, టెలిఫోన్ పిఎల్‌సి కేసులు ఉన్నాయి. మణుగూరులో 286 క్రిమినల్ కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా ముగియడంతో పాటు పక్షాల మధ్య సఖ్యత పెరుగుతుందని న్యాయవర్గాలు తెలిపాయి.

## గ్యాస్ కొరతకు కారణం ప్రభుత్వ వైఫల్యమే

- నో స్టాక్ బోర్డ్లతో ప్రజల ఆవేదన
- పునరుద్ధరించకపోతే ఆదివాసి సేన ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధం: వజ్జా జ్యోతి బసు



**మణుగూరు, మార్చి 28, (ప్రజాజ్యోతి) :** ప్రజలకు అందుబాటులో గ్యాస్ ఉందని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ వంటగ్యాస్ (ఎల్ పిజి) కొరత తీవ్ర స్థాయికి చేరుకుందని దీంతో గ్యాస్ కొరతపై ప్రభుత్వ వైఫల్యం బహిర్గతం అయిందని శనివారం ఓ పత్రికా ప్రకటనలో ఆదివాసీ సేన రాష్ట్ర ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వజ్జా జ్యోతి బసు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్యాస్ ఏజెన్సీల వద్ద ఎక్కడ చూసినా నో స్టాక్ బోర్డు దర్శనమిస్తుండటం ప్రభుత్వ పాలనలో ఉన్న ఘోర వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.పత్రిక ప్రకటనల్లో గ్యాస్ సరఫరా సక్రమంగా జరుగుతోందని ప్రభుత్వం చెప్పడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు రోజులు, వారాలు తిరిగినా గ్యాస్ సిలిండర్లు దొరకని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సాధారణ విషయం కాదని ప్రజల ప్రాథమిక అవసరాన్ని కూడా నెరవేర్చలేని ప్రభుత్వ పాలనకు ఇది స్పష్టమైన ఉదాహరణ అని తెలిపారు. అధికారులకు పాలనపై ఎలాంటి స్పష్టత లేకపోవడం, గ్యాస్ ఏజెన్సీల వద్ద లభ్యతపై సరైన సమాచారం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు ఆదివాసీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారిందని ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను సక్రమంగా పునరుద్ధరించకపోతే ఆదివాసీ సేన ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ప్రజలతో కలిసి రోడ్డెక్కి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజల సహనాన్ని పరీక్షించకుండా నో స్టాక్ బోర్డ్లు ఏర్పాటుకు కారణమైన నిర్లక్ష్యపు అధికారులపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. వాస్తవ సమాచారం అధికారులు, ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## ఏప్రిల్ 2వ తేదీ జరిగే ధర్మ పోరాట సభను విజయవంతం చేయండి



**టేకులపల్లి,మార్చి 28,ప్రజాజ్యోతి:** ఏప్రిల్ 2వ తేదీ జరిగే ధర్మ పోరాట సభను విజయవంతం చేయాలి అని ఎస్సీ హక్కుల పోరాటం సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు.శనివారం టేకులపల్లి మండలం సులానగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్సీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పాల్గొని, ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీలో గత ప్రభుత్వంలో తొలగించబడిన 36 ఎంపీటీసీలు,6 జెడ్పిటిసి స్థానాలను స్థానాలను ఎస్సీలకు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీలతో సమానంగా ఎస్సీలకు భూమి హక్కు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీల కంటే ఏజెన్సీలో ఎస్సీలే అధికంగా పేదలు ఉన్నారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్సీ హక్కుల సాధన కోసం ఈ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుంది. ఈ సభకు ఎస్సీలు సోదరి సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బి. రమేష్, జిల్లా బాధ్యులు కె. సుందర్ పాల్, కో - కన్వీనర్ కె. సురేష్,డి. చెన్నయ్య, కె. బిక్షం, గౌరవ సలహాదారులు యు. దేవరాజ్, ఆర్. నరసయ్య, జి. కిరణ్, సిహెచ్. రాములు, సిహెచ్.సునీల్,బి. ప్రకాశం, ఎం. కమలాకర్,సందీప్, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం పట్టాభి రాముడిని ప్రార్థించాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**భద్రాచలం, మార్చి 28, ప్రజా జ్యోతి:** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని భద్రాద్రి పట్టాభిరాముడిని ప్రార్థించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.శనివారం పట్టాభిషేకం జరిగిన ఆలయ ఆవరణలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని భగవంతుని వేడుకున్నట్లు పేర్కొన్నారు.భద్రాచలం ఆలయ అభివృద్ధి రామభక్తుల చిరకాల వాంఛ అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.350 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు.భద్రాచలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభు త్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## 'జై జనసేన' క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**భద్రాచలం టౌన్, మార్చి 28 ,ప్రజాజ్యోతి**,భద్రాచలం పట్టణంలోని పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం 'జై జనసేన' ఇంగ్లీష్ దినపత్రిక నూతన క్యాలెండర్ ను వైభవంగా ఆవిష్కరించారు. పత్రిక ఎడిటర్ పూనెం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాత్రికేయ రంగంలో కొత్తగా అడుగు పెట్టిన జై జనసేన దినపత్రిక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రముఖ నాయకులు సమీర్ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో పత్రిక దినదినాభివృద్ధి చెందాలని వారు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## చెరువులో గుర్తుతెలియని మృతదేహం



**అశ్వారావుపేట, మార్చి 28, ప్రజాజ్యోతి :** మండలంలోని గంగారం గ్రామసరిహద్దు చెరువులో ఓ మృతదేహం తేలుతున్నట్లుగా గ్రామస్తులు గుర్తించి శనివారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని, మృతదేహం ఉబ్బిపోయి బాగా దుర్వాసన వస్తుందని, రాత్రి సమయం కావడంతో మృత్తుదేహాన్ని వెలికి తీసేందుకు వీలు లేకపోవడంతో సహాయక చర్యలను ఆదివారం చేపడతామని ఎస్సై యయాతి రాజు స్పష్టం చేశారు.

# రామభక్తుల నడుమ వైభవంగా శ్రీ సీతారాముల శోభాయాత్ర






- చెక్కభజనలతో రామ భక్తుల సేవలు, భక్తుల విశేష స్పందన

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 28, ప్రజా జ్యోతి:**
అన్నపురెడ్డిపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించారు. అనంతరం శనివారం సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామ పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు.శోభాయాత్ర సందర్భంగా ముందుగా రామ భక్తులు చెక్కభజన చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. భజనలతో గ్రామమంతా భక్తి మయ వాతావరణం నెలకొంది.గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించారు. స్వామివారి ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.రామాలయం కమిటీ సభ్యులు సమన్వయంతో శోభాయాత్రను నిర్వహించి, గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడేలా చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రామ భక్తులు, యువత పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేశారు.

# కర్బూజా (మస్క్‌మెలన్) యొక్క ఆరోగ్య ప్రయోజనాలు

**కర్బూజాలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి మరియు దీనిని బరువు తగ్గడానికి, ఆరోగ్యకరమైన చర్మానికి, ఆరోగ్యకరమైన గుండెకు, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి మరియు కంటి చూపు కోసం ఉపయోగించవచ్చు. ఇది మూత్రపిండాల్లో రాళ్లను నయం చేయడానికి సహాయపడుతుంది మరియు గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలను నివారిస్తుంది. ఇది ఋతుక్రమ నొప్పులను కూడా తగ్గిస్తుంది.**



### కర్బూజా (మస్క్‌మెలన్)

క్యాంటలోప్ లేదా మస్క్‌మెలన్ అనేది కుకుర్బిటేసి కుటుంబానికి చెందిన ఒక రకమైన పుచ్చకాయ. దీని శాస్త్రీయ నామం కుకుమిస్ మెలో వర్. క్యాంటలుపెన్సిస్. మస్క్ మెలన్లు ఆరోగ్యకరమైన పోషకాలకు ఒక శక్తి కేంద్రం. వీటిలో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇవి రుచిగా ఉండటమే కాకుండా అద్భుతమైన సువాసనను కూడా కలిగి ఉంటాయి.

### సీతాఫలం (ఖర్బుజా) యొక్క పోషక విలువ

కర్బూజాలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్ , పీచుపదార్థం, సోడియం , విటమిన్ ఎ , ఫోలిక్ యాసిడ్, నియాసిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. కర్బూజాలో కాల్షియం , మెగ్నీషియం , పొటాషియం , కెరోటినాయిడ్లు వంటి పోషకాలు కూడా మంచి పరిమాణంలో సమృద్ధిగా ఉంటాయి . ఇందులో కొవ్వు, కొలెస్ట్రాల్ లేదా సంతృప్త కొవ్వు ఉండవు.

కర్బూజా (మస్క్‌మెలన్) యొక్క ఉత్తమ ఆరోగ్య ప్రయోజనాలు క్రింద పేర్కొనబడ్డాయి.కర్బూజా రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడుతుందికర్బూజాలోని విటమిన్ సి మరియు విటమిన్ ఎ రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. ఇది శరీరంలోని తెల్ల రక్త కణాలను ఉత్తేజపరచడంలో సహాయపడుతుంది. లింఫోసైట్లు శరీర సహజ రక్షణ యంత్రాంగంగా ప్రసిద్ధి చెందాయి, ఎందుకంటే అవి బయటి కారకాలు దాడి చేయకుండా నిరోధించడమే కాకుండా, శరీరంపై దాడి చేసే ఇన్ఫెక్షన్లను కూడా నిర్మూలిస్తాయి. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ అయినందున, విటమిన్ సి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో కూడా సమర్థవంతంగా పోరాడుతుంది. ఈ ఫ్రీ రాడికల్స్ చర్మాన్ని దెబ్బతీసి, అకాల వృద్ధాప్యానికి కారణమవుతాయి.

### గుండె సంబంధిత ఆరోగ్యానికి కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాలో ఉండే అడెనోసిన్ కారణంగా, దానికి ఉండే రక్తం గడ్డకట్టకుండా నిరోధించే గుణాలు రక్తాన్ని పల్చబరచడంలో సహాయపడతాయి, దీనివల్ల గుండె జబ్బుల ప్రమాదం దానంతట అదే తగ్గుతుంది. ఈ పుచ్చకాయలలో పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది రక్తపోటును నియంత్రించి, తద్వారా మన గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

### కర్బూజా క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది

కర్బూజాలలో విటమిన్ సి మరియు బీటా–కెరోటిన్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని, తొలగించగలవు . లేకపోతే ఈ ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ కణాల పెరుగుదలకు అవసరమైన పోషకాలను అందిస్తాయి.

### కర్బూజా ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది

క్యాంటలూప్ లేదా మస్క్‌మెల్లోలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది గుండె కొట్టుకోవడాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చి, మెదడుకు ఆక్సిజన్ సరఫరాను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల మనం మరింత ప్రశాంతంగా, ఏకాగ్రతతో ఉండగలుగుతాము, తద్వారా ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. దీనిలో ఉండే సూపర్‌ఆక్సైడ్ డిస్మ్యుటేజ్ అనే ఎంజైమ్ రక్తపోటును తగ్గించి, నరాలను ప్రశాంతపరచడం ద్వారా ఒత్తిడిని ఎదుర్కొంటుంది.

### కంటి ఆరోగ్యానికి కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాలో తగినంత పరిమాణంలో ఉండే విటమిన్ ఎ మరియు కెరోటిన్ కంటి శుక్లాన్ని నివారించడంలో మరియు దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

### మధుమేహ నెఫ్రోపతిని నివారించడంలో కర్బూజా సహాయపడుతుంది

డయాబెటిక్ నెఫ్రోపతీ , అంటే మూత్రపిండ కణాలు ప్రమాదకరంగా దెబ్బతినే ఒక మూత్రపిండాల రుగ్మతను, "ఆక్సికైన్" అని పిలువబడే కంటాలూప్ సారంతో నివారించవచ్చు. అంతేకాకుండా, కంటాలూప్ లేదా మస్క్‌మెలన్‌లో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (GI) ఉంటుంది, అంటే కంటాలూప్‌లో ఉండే ఫ్రక్టోజ్ మరియు గ్లూకోజ్ ఒక సరళ చక్కెర . ఇది డయాబెటిక్ నెఫ్రోపతీని నివారించడానికి సహాయపడుతుంది.

### నిద్రలేమి చికిత్సకు కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాకు శక్తివంతమైన విరేచనకారి గుణాలు ఉన్నాయి. దీనిలో నరాలకు ఉపశమనం కలిగించి, ఆందోళనలను శాంతపరిచే ఒక ప్రత్యేకమైన సమ్మేళనం ఉంటుంది. అందువల్ల, ఇది నిద్రలేమి సమస్యలను తొలగించి, నిద్రలేమితో బాధపడేవారికి గాఢ నిద్ర పట్టడానికి సహాయపడుతుంది .

### ఋతు సమస్యలకు కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాలో ఉండే రక్తం గడ్డకట్టకుండా నిరోధించే గుణం, ఋతుస్రావం సమయంలో గడ్డలను కరిగించి, కండరాల నొప్పులను తగ్గిస్తుంది . కర్బూజాలో ఉండే విటమిన్ సి కూడా ఋతుస్రావాన్ని క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది.

### గర్భిణీ స్త్రీలకు కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాలో అధికంగా ఉండే ఫోలేట్ గర్భిణీ స్త్రీలలో అదనపు సోడియంను తొలగించి, నీరు నిలుపుదల సమస్యలను తగ్గిస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తి మరియు నిర్వహణకు సహాయపడటమే కాకుండా, పిండాలలో నాడీ నాళ సంబంధిత రుగ్మతలను కూడా నివారిస్తుంది.

### ఊపిరితిత్తులకు కర్బూజా వల్ల కలిగే ప్రయోజనాలు

కర్బూజాను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో లోపించిన విటమిన్ ఎ తిరిగి భర్తీ అవుతుంది. ఇది ఊపిరితిత్తులను పునరుజ్జీవింపజేయడంలో సహాయపడుతుంది మరియు ధూమపానం వల్ల ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బ తిన్న వారికి ఇది ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది .